www.prajasakti.com


ప్రజాశక్తి

బుధవారం 15 మార్చి 2023 | 5 | తూర్పుగోదావరి



విద్యుదాఘాతానికి గురై రైతు మృతి

ప్రజాశక్తి - గోపాలపురం



పొలంలో మోటర్ స్విచ్ ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వెంకటాయపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వెంకటాయపాలేనికి చెందిన రైతు మద్దిపాటి నరసింహారావు సోమవారం సాయంత్రం పొలానికి నీరు పెట్టేందుకు మోటారు స్విచ్ ఆన్ చేశాడు. ఈ క్రమంలో కరెంటు వైర్ తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మతుని భార్య బేబీసరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.

గ్యాస్..మాయ...

గృహ వినియోగ సిలిండర్లు పక్కదారి
లబ్ధిదారుల పేరుతో కంపెనీలే బుకింగ్
యథేచ్ఛగా వాణిజ్య అవసరాలకు మళ్లింపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి



గహ వినియోగ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక భారం సాకుతో క్రమక్రమంగా గ్యాస్‌పై రాయితీని తొలగించిన విషయం విధితమే. కేవలం ఉజ్వల్ కనెక్షన్‌లున్న లబ్ధిదారులకు మాత్రమే రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. అదికూడా ఒక్కో సిలిండర్‌కు సగటున రూ.10.50 మాత్రమే రాయితీ ఇస్తూ వస్తోంది. మరోవైపు ప్రతిరోజు జిల్లాలో వందలాది సిలిండర్లు వాణిజ్య అవసరాలకు తరలిపోతున్నాయి. అక్రమార్కులపై కనీస చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. లక్ష్యాలను చేరుకోవడానికి కొందరు కంపెనీల ప్రతినిధులే ప్రోత్సహిస్తున్నారు. గ్యాస్ కంపెనీలకు లబ్ధిదారుల పేరుతో నేరుగా గ్యాస్ బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. దీంతో పెద్ద మొత్తంలో గ్యాస్ పక్కదారి పట్టేందుకు కారణమవుతోంది. జిల్లాలో సుమారు 3.50 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉంటాయని అంచనా. ప్రతిరోజూ జిల్లాలో 8వేల గహ వినియోగ సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. అందులో నాలుగో వంతు అంటే 2వేల సిలిండర్లు పక్క దారి పట్టి వ్యాపార అవసరాలకు తరలిపోతున్నట్టు సమాచారం.

లక్ష్యం చేరుకోవడమే ప్రధానం

గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల పక్కదారి పట్టడంలో తిలాపాపం తలాపిడికెడు అన్నట్టు అందరి ప్రమేయం ఉంది. ప్రభుత్వం రాయితీలో కోత విధించడంతో కంపెనీలకు పూర్తిస్థాయి సొమ్ము వసూలు అవుతోంది. గతంలో కేంద్ర ప్రభుత్వం కంపెనీలకే రాయితీ జమ చేసింది. సెంట్రల్ పూల్ కింద రాయితీ జమయ్యేది. అయితే సక్రమంగా కంపెనీలకు జమచేసేది కాదు. రాయితీ విధానంలో కేంద్రం మార్పులు చేసింది. నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తోంది. కంపెనీలపై రాయితీ భారం తగ్గింది. దాంతో అమ్మకాలు అధి కంగా నిర్వహించాలని గ్యాస్ కంపెనీలు లక్ష్యాలను నిర్దేశిస్తున్నాయి. కంపెనీలే నేరుగా బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించాయి. దాంతో కంపెనీ ప్రతినిధులు లబ్ధిదారుల పేరుతో బుక్ చేస్తున్నారు. ఆయా డీలర్ల పరిధి లోని లబ్ధి దారుల పేరుతో గ్యాస్ సిలెండర్‌లు కేటాయిస్తు న్నారు. వాస్తవానికి క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులు వాటిని తీసుకోవడం లేదు. దాంతో కొందరు డీలర్‌లు అటువంటి సిలిండర్లను హోటళ్లకు మళ్లించేస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో లబ్ధిదారులపై భారం

జిల్లాలో ప్రతిరోజు 2000 సిలిండర్లు పడుతున్నాయి. ఏడాదికి దాదాపు రూ.66 కోట్లు నష్ట పోతున్నట్టు అంచనా. చివరకు కేంద్ర ప్రభుత్వం గ్యాస్ రాయితీ ఇవ్వలేనంటూ లబ్ధిదారులపై భారం మోపుతోంది. గహ వినియోగ గ్యాస్‌కు గతంలో డిమాండ్ ఉండేది. బుక్ చేసుకున్న వారం రోజులకు గ్యాస్ సరఫరా అయ్యేది కాదు. అప్పట్లో పౌర సరఫరాల శాఖ అజమాయిషీ ఉండేది. డీలర్లకు సరఫరా అయ్యే గ్యాస్‌పై దృష్టి పెట్టేవారు. ప్రతి రోజు లెక్కలు తీసుకునేవారు. హోటళ్లను తనిఖీ చేసి గృహ వినియోగ గ్యాస్ వినియోగిస్తే చర్యలు ఉండేవి. కనెక్షన్‌లు సీజ్ చేసేవారు. జరిమానాలు విధించేవారు. ప్రస్తుతం వంటగ్యాస్ సరఫరాలో బ్యాక్‌లాగ్ అనే పరిస్థితి లేదు. మరో వైపు పౌరసరఫరాల శాఖలో సిబ్బంది కొరత వెంటా డుతోంది. ఫలితంగా డీలర్ల నుంచి సమాచారం సేకరించ డం లేదు. తనిఖీలు చేపట్టడం లేదు. ఈ పరిణామాలు గ్యాస్ కంపెనీల ప్రతినిధులకు ఆర్థికంగా లాభాన్ని చేకూర్చుతున్నాయి. ప్రజలపై భారం పడుతోంది.

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాణిజ్య అవసరాలకు కమర్షియల్ సిలిండర్‌లను మాత్రమే వినియోగించాలి. గృహ వినియోగ సిలిండర్లు వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాయి. కొనుగోలుదారులతో పాటు సహకరించిన ఏజెన్సీ నిర్వహకులపైనా చర్యలు ఉంటాయి.

- ప్రసాదరావు, డిఎస్ఒ, తూర్పుగోదావరి జిల్లా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరీక్షల ఛీఫ్ సూపరింటెండెంట్ ఉమాదేవి

నిమిషం ఆలస్యమైనా ఇంటికే...

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఇంటర్ పరీక్షలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతిని నిరాకరిస్తారని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 140 కేంద్రాల్లో 1,02,643 మంది ఇంటర్ విద్యార్థులు పరీక్షలు హాజరు కానున్నారు.

గోపాలపురం : నిమిషం ఆలస్యమైన పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని ఇంటర్ విద్యార్థులకు ఇంటర్ పరీక్షల ఛీఫ్ సూపరింటెండెంట్, ఉభయ కళాశాలల కస్టోడియన్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ టి.ఉమాదేవి తెలిపారు. గౌతమి జూనియర్ కళాశాలలో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. 309 మంది మొదటి, 236 మంది ద్వితీయ ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరి కోసం 12 గదులను కేటాయించామని తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరం పరీక్షలు రాసే విద్యార్థులు 351, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 317 పరీక్షలు రాస్తున్నారన్నారు. వీరికి 14 రూములు కేటాయించామన్నారు. సిసి కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రతి విద్యార్థి గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

కడియం : ఇంటర్ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు మండలంలోని మురమండ పిచ్చుక కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఇఒ వి.లజపతిరాయ్ తెలిపారు. కడియం షిర్డీ సాయి కాలేజీ నుంచి మొదటి, ద్వితీయ సంవత్సరాలకు గాను 126 మంది విద్యార్థులు, మురమండ జూనియర్ కళాశాల నుంచి 120 మంది విద్యార్థులు, కడియం జెడ్‌పి హై స్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాల నుంచి 28 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారని తెలిపారు.

నిడదవోలుకు తరలిన ఇంటర్ పరీక్షా కేంద్రం

చాగల్లు : చాగల్లు వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని నిడదవోలు తరలించినట్లు ప్రిన్సిపల్ పావని తెలిపారు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులు 50 మంది ద్వితీయ సంవత్సర విద్యార్థులు 83 మొత్తం 133 మంది విద్యార్థులు నిడదవోలు పరీక్షా కేంద్రంలో బుధవారం నుంచి పరీక్షలు రాస్తారని ఆమె తెలిపారు.

డంపింగ్ యార్డ్ సమస్యపై వినతి

ప్రజాశక్తి - ధవళేశ్వరం

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని ధవళేశ్వరం గ్రామస్తులు, వైసిపి నాయకులు పంచాయతీ కార్యదర్శికి, కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ విషయాన్ని వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. బొమ్మూరు, హుకుంపేట, ధవళేశ్వరం పంచాయతీల్లో శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను సేకరిస్తున్నా శాశ్వత డంపింగ్ యార్డ్ లేకపోవడంతో వారు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో చెత్తను సేకరించి బొమ్మూరు సుద్దగని ప్రాంతంలో గొయ్యిలో డంప్ చేసేవారు. అక్కడ చెత్తను డంప్ చేయడం వల్ల తమ కుటుంబాలు అనారోగ్యానికి గురవుతున్నాయని బొమ్మూరు గ్రామస్తులు చెబుతున్నారు. అక్కడ డంపింగ్ చేయనివ్వకుండా నిరసనలు తెలుపుతున్నారు. దీంతో ధవళేశ్వరంలో సేకరించిన చెత్తను డంప్ చేసే వీలులేక పంచాయతీ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. రెండు రోజులుగా ధవళేశ్వరం పంచాయతీలో సేకరించిన చెత్తను ట్రాక్టర్లతో సహా ఆ పంచాయతీ ఆవరణలోనే నిలిపివేయడంతో చుట్టుపక్కల ప్రదేశాలు దుర్గంధంతో నిండిపోయింది. దీనిపై స్థానిక వైసిపి నాయకులు స్పందించి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వరావు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి వెంటనే అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక ప్రజలు చెత్త తరలింపు కోసం ధవళేశ్వరం గ్రామ పంచాయతీ కార్యదర్శికి, జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. దీనిపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని పెరవలిలో టిడిపి నియోజవర్గం ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ శేషారావు ఆదేశాల మేరకు మంగళవారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి జగన్ ప్రభుత్వం పేదలపై మోపుతున్న భారాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు సలాది కృష్ణమూర్తి, రాజమండ్రి పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బొడ్డు రామాంజనేయులు, ఎంపిటిసి సభ్యులు రాపాక ప్రమీల, నాయకులు సురేష్, పి.మావుళ్లు, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

17న వాహనాలకు వేలం

ప్రజాశక్తి -కోరుకొండ

వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు ఈనెల 17న వేలం నిర్వహించనున్నట్లు కోరుకొండ ఎస్ఇబి ఎస్ఐ తెలిపారు. ఎస్ఇబి జిల్లా జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించ నున్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.5వేల ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

100 మందికి దంత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని తీపర్రులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ బివి.రాజు విష్ణు దంత వైద్య కళాశాల సహకారంతో దాత కుందుల భూపతిరావు ఆర్థిక సాయంతో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 100 మందికి దంత వైద్య పరీక్షలను నిర్వహించారు. వైద్య శిబిరాన్ని లయన్స్ రీజనల్ చైర్‌పర్సన్ కారుమూరి రామలింగేశ్వరరావు, జోన్ చైర్‌పర్సన్ వంక రాజకుమారి ప్రారంభించారు. లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

గుక్కెడు నీళ్లు ఇప్పించండి మహాప్రభో..

- **కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల ఆవేదన**
- **పట్టించుకోని అధికారులు**

ప్రజాశక్తి - కడియం

కోట్లాది రూపాయలతో ఆసుపత్రిలో అభివృద్ధి పనులు చేపట్టారు. వాటిని పూర్తి కూడా చేశారు. ఖరీదైన వైద్య పరికరాలను, మౌలిక వసతులలో భాగంగా కొన్ని రకాల వస్తువులను గతంలోనే దాతలు సమకూర్చారు. పూర్తిస్థాయి వైద్య సిబ్బందితో ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలను సైతం అందిస్తున్నారు... కాని ఇక్కడ రోగులకు గుక్కెడు మంచినీళ్లను మాత్రం అందించలేకపోతున్నారు. వేసవి తీవ్రతతో ఇప్పటికే జనం అల్లాడుతున్నారు. ఇక రోగుల పరిస్థితి మరింత దారుణం. ఎండలో పడొచ్చి గుక్కెడు నీటితో గొంతు తడుపుకునే వీలు లేక వారు నాని ఇబ్బందులు పడుతున్నారు.

కొన్నేళ్ల క్రితం ఆంధ్ర పేపర్ మిల్ వారు రోగుల సౌకర్యార్థం తాగునీటి కూలర్‌ను ఆసుపత్రికి సమకూర్చారు. కొన్నాళ్లపాటు రోగులు, ఆసుపత్రి సిబ్బంది దీని ద్వారా దాహార్తిని తీర్చుకున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో ఇది రోగులకు దూరమైంది. ఆసుపత్రి లోపల మంచినీళ్ల సరఫరా చేసే శీతల పానీయం అందించే మరో చిన్న యంత్రం కూడా ఉంది. దాని ద్వారా కూడా ఏడాదికో పండుగ అన్నట్లు అప్పుడప్పుడూ మాత్రమే తాగునీరు లభిస్తుంది. నిత్యం వందలాది మంది రోగులు వైద్య సేవలు పొందడానికి వస్తుంటారు. పదుల సంఖ్యలో బాలింతలు ప్రతి రోజూ వస్తుంటారు. కొంత మంది రోగులు



ఆసుపత్రిలో ఉండి రోజుల తరబడి వైద్య సేవలు పొందుతున్నారు. గుక్కెడు నీళ్లు అందడం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి సిబ్బంది, అభివృద్ధి కమిటీ, పాలకులు ఈ చిన్నపాటి సమస్యను పరిష్కరించి, రోగుల దాహార్తిని తీర్చాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వాసుత్రిలోనే కాన్పులు : డిసిహెచ్ఎస్

ప్రజాశక్తి-గోపాలపురం

ప్రభుత్వ ఆసుపత్రిలోనే గర్భిణులు కాన్పులు వేసుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలని డిసిహెచ్ఎస్ అధికారి ఎం.సనత్‌కుమారి సూచించారు. మంగళవారం గోపాలపురం సిహెచ్‌సిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ఈ సిహెచ్‌సిలో కాన్పుల కేసులు తగ్గాయన్నారు. నెలకు 30 డెలివరీలు చేయాల్సి ఉండగా ఫిబ్రవరిలో 17 మాత్రమే జరగడంపై ఆరా తీశారు. ఈ సిహెచ్‌సి పరిధిలో ఆరు పిహెచ్‌సిలు ఉన్నాయన్నారు. ఈ పిహెచ్‌సిల పరిధిలో హైరిస్క్ డెలివరీలు గోపాలపురం సిహెచ్‌సిలో చేయాల్సి ఉందన్నారు. దీని కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మూడు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి నెలా మొదటి మంగళవారం ఆశా వర్కర్లతో గోపాలపురం సిహెచ్‌సిలో అవగాహన కల్పించి, గర్భిణుల వివరాలు సేకరించాలన్నారు. జనరేటర్, పోస్టుమార్టం షెడ్ నిర్మాణాలకు మంజూరు లభించిందన్నారు. ఆమె వెంట వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ఐన్‌స్టీన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

తాళ్లపూడి : భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌ను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా తయారు కావాలని రాగోలపల్లి ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు అన్నారు. ఐన్‌స్టీన్ జయంతి సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో ఆల్బర్ట్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడారు. ఐన్‌స్టీన్ ప్రయోగాలను, జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు.

లక్ష్యాలకు మించి గృహ ప్రవేశాలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

అనుకున్న లక్ష్యాలను అధిగమించి జగనన్న కాలనీలో ఉగాది నాటికి సామూహిక గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని గృహ నిర్మాణ శాఖ పీడీ జి.పరుశురాం తెలిపారు. మండల పరిధిలోని సూరయ్యపేట వద్ద వైఎస్ఆర్ నగర్, గజ్జరం గ్రామంలో నిర్మితమవుతున్న గృహాలను ఆయన మంగళవారం పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల ఇళ్లల్లో సామూహిక గృహప్రవేశాలు చేయాలనేది ప్రభుత్వ నిర్దేశం కాగా తూర్పుగోదావరి జిల్లాలో 60 వేల ఇళ్లకు గాను 60 శాతం పూర్తి అయ్యాయని పీడీ తెలిపారు. జగనన్న కాలనీలో నీళ్ల సమస్యను గుర్తించామని దీని పరిష్కారం కోసం ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడనున్నట్లు చెప్పారు. పీడీ వెంట ఎంపిడిఒ ఎం.రాజశేఖర్, గ్రామ కార్యదర్శి వీరన్న, హౌసింగ్ డిఇ శ్రీనివాస్, ఎఇ సుబ్బరాజు, వర్క్ఇన్‌స్పెక్టర్ సుధాకర్ సిబ్బంది ఉన్నారు.

అక్షయ్ రామ్‌కి రూ.లక్ష ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గోకవరం

కొంతకాలంగా అస్వస్థతో బాధపడుతున్న అక్షయ్ రామ్‌కు వైద్యం నిమిత్తం రూ.లక్ష ఆర్థిక సాయాన్ని గోకవరానికి చెందిన పసుమర్తి శ్రీనివాసరావు మంగళవారం అందజేశారు. శ్రీనివాసరావు హైదరాబాదులో నివాసం ఉంటున్నాడు. చిన్నారి అక్షయ్ రామ్ విషయాన్ని గ్రామస్తులు ఆయన తెలియజేశారు. స్పందించిన ఆయన లక్ష రూపాయలను మేనల్లుడు అయ్యప్ప ద్వారా వైద్యులు పాలూరి బోసుబాబుకు అందించారు. బోసుబాబు మాట్లాడుతూ అక్షయ్ రామ్ అనారోగ్య పరిస్థితిని గమనించి పలువురు ఆర్థిక సహాయం అందజేస్తున్నారన్నారు ఇప్పటివరకు రూ.12 లక్షల వరకూ ఆర్థిక సాయం అందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, స్థానికులు పొట్నూరి సత్తిబాబు, తామర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలిన కార్యకర్తలు

ప్రజాశక్తి-నల్లజర్ల


మచిలీపట్నంలో మంగళవారం నిర్వహించిన జనసేన పార్టీ 10వ ఆవిర్భావ దినోత్సవ సభకు గోపాలపురం నియోజక వర్గం నుంచి ఆ పార్టీ నియోకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు ఆధ్వర్యంలో సుమారు 500 మంది తరలి వెళ్లారు. 50 కార్లు, 10 బస్సుల్లో వారు తరలి వెళ్లారు. తొలుత నియోకవర్గంలోని జనసైనికులు నల్లజర్ల కూడలికి చేరుకున్నారు. అక్కడ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం నియోకవర్గ నాయకులు దొడ్డిగర్ల సువర్ణ రాజు, అవపాడు సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండల అధ్యక్షులు చోడ సాని బాపిరాజు, దాకారపు నరసింహ మూర్తి, కాట్నం గణేష్, పి.రాజేంద్ర, రుద్ర శ్రీను, పి.నాని, పి.కాంతారావు పాల్గొన్నారు.

గోకవరం ఆసుపత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి- గోకవరం

గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిని తూర్పుగోదావరి జిల్లా కాయకల్ప స్టేట్ టిబి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ బృందం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను ఆసుపత్రి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బందితో డాక్టర్ రమేష్ మాట్లాడారు. ప్రజలకు అన్ని విధాల వైద్య సేవలను అందించాలన్నారు. ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, ఒపిలను పరిశీలించారు. అనంతరం ప్రధానమంత్రి నిక్షయ మిత్ర కార్యక్రమంలో భాగంగా స్థానికులు గంగిశెట్టి బాల కోటేశ్వరరావు ద్వారా ఇద్దరు రోగులకు న్యూట్రిషన్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంహెచ్ఒ జిల్లా లెప్రసీ ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ ఎం.వసుంధర, డాక్టర్ వనజకుమారి, డాక్టర్ ప్రదీప్‌సుందర్, కాయకల్ప టీం సభ్యులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



డీవార్మింగ్ డే జయప్రదం

ఏలూరు/ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో మంగళవారం నిర్వహించిన నులిపురుగుల నివారణ దినం విజయవంతం మైంది. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆల్బెండోజోల్ మాత్రలను భోజనం తరువాత మింగించారు. **కడియం** మండలంలో అన్ని విద్యాసంస్థల్లో నులిపురుగుల నివారణ దినాన్ని నిర్వహించారు. కడియం-1 ప్రాథమిక పాఠశాలలో ఎంఇఒ వి.లజపతిరాయ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 16,724 మందికి లక్ష్యం కాగా, తొలి దశలో 95శాతం పూర్తి చేశామని లజపతిరాయ్ తెలిపారు. ఆరోగ్య సిబ్బంది బి.సునీత, పి.కుసుమ, హెచ్ఎం కె.లక్ష్మణకుమార్ పాల్గొన్నారు. **ఉండ్రాజవరంలో** అన్ని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్లు, ఇళ్ల వద్ద ఉన్న చిన్నారులతోనూ మాత్రలను మింగించారు. కొవ్వూరు డిప్యూటీ డిఎంహెచ్ఒ జి.వరలక్ష్మి, ఎంపిడిఒ ఎ.శ్రీనివాసరావు, ఎంపిపి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. పిహెచ్‌సి వైద్యాధికారి రాజనాల ప్రసాద్, సిహెచ్ఒ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. **చాగల్లు** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డీవార్మింగ్ డేను నిర్వహించారు. మాత్రలు మింగని వారికి ఈ నెల 18న మాత్రలు వేస్తామని పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తనూజ తెలిపారు. **గోకవరంలోని** అన్ని ప్రభుత్వ ప్రైవేట్ స్కూల్స్, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవాన్ని కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రవిచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది మేరీ కృప, ఎంపిహెచ్ఇఒ వైఎస్.రాయుడు శైలజ, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **నల్లజర్లలో** నులి పురుగుల నివారణకు వైద్య ఆరోగ్యశాఖ చేస్తున్న కృషి అభినందనీయమని డాక్టర్ ఎస్ఆర్‌కె కెఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ కంఠమణి నారాయణప్రసాద్ అన్నారు. ఎస్ఆర్‌కె కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన పిల్లలతో అల్బెండజోల్ మాత్రలు మింగించారు. మొత్తం 14,258 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.సుబ్రహ్మణ్యం, పూర్వపు ప్రిన్సిపల్స్ బి.వెంకటేశ్వర్లు, ఎన్.సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.కిరణ్‌కుమార్, ఆరోగ్య కార్యకర్త సిహెచ్‌జ్యోతి తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి** మండలంలోని గౌరీపట్నంలోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి, సిహెచ్ఒ ఎం.కృష్ణుడు, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఫణి శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు. **గోపాలపురం** హుకుంపేట, అన్నదేవర పేట పరిధిలోగల విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నులిపురుగుల నివారణ మందులు వేశారు. వేళ్లచింతలగూడెం ఎంపియుపి పాఠశాల హెచ్ఎం రత్నమణి, గుడ్డిగూడెం ఎంపిపి స్కూల్ హెచ్ఎం వీరభద్రుడు మాట్లాడుతూ నులిపురుగుల నివారణతో రక్తహీనత లోపాన్ని నివారించొచ్చన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశా వర్కర్ ఎం.ప్రమీల, సిఆర్‌పి కొయ్య నాగరాజు, త్రిమూర్తులు, మంజుల, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **పెరవలి** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 7,142 మందికి 6,627 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. 92 శాతం సాధించామని వైద్యాధికారులు డాక్టర్ విజయకుమార్, డాక్టర్ సత్యకృష్ణవేణి తెలిపారు. ఎంపిడిఒ ఎస్.రమేష్, ఎంఇఒ వెలగల హైమావతి సర్పంచులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



గోకవరంలో...



గోపాలపురంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

నేరాలు ఘోరాలు

బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - గండేపల్లి

తన కుమార్తెను కిడ్నాప్ చేశాడంటూ తల్లి కోడి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్టు గండేపల్లి ఎస్ఐ వై గణేష్ కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గండేపల్లి వివాహితుడు వేమగిరి సత్యానందం అదే గ్రామానికి చెందిన గత కొంతకాలంగా నాగమణి రెండవ కూతురు జడ్పి హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలిక వెంటపడుతూ ఆమెను వేధించేవాడు. పలుమార్లు పెద్దలలో పెట్టినప్పటికీ అతను పెద్దల మాట కూడా లెక్కచేయ కుండా ఆ అమ్మాయి వెంటపడుతూ ఆమెకు మాయ మాటలు చెప్పి ఈ నెల 7వ తేదీన ఆ అమ్మాయి స్కూలుకి వెళ్లడానికి ఆటో కోసం ఇంటి బయట వేచి ఉండగా సత్యానందం ఆమెను కిడ్నాప్ చేసి తీసుకుని వెళ్లిపోయాడని, సత్యానందమే బాలికను తీసుకువెళ్లిపోయినట్లుగా గ్రామంలో అందరికీ తెలియడంతో మరుసటి రోజున ఆమెను యతిరిగి గ్రామానికి తీసుకుని వచ్చినట్లు బాలిక తల్లి కోడి నాగమణి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గండేపల్లి ఎస్ఐ వై గణేష్ కుమార్ తెలిపారు.

పేకాటశిబిరంపై దాడి : 8 మంది అరెస్టు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలోని వేట్లపాలెంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినట్టు సామర్లకోట సిఐ కెదుర్గాప్రసాద్ తెలిపారు. తన సిబ్బందితో మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించి 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుండి రూ.20,160 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు సిఐ తెలిపారు.

10 లీటర్ల సారాతో ముగ్గురి అరెస్ట్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎస్‌సిఇబీ సిబ్బంది సోమవారం తెల్లవారు జామున మండలంలోని ఒమ్మంగి గ్రామ రామాలయం వద్ద సారతో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం ఈ గోకవరానికి చెందిన పూజల సత్తిబాబు, మాడెం గణేష్‌లు బురద కోట గ్రామం నుండి తమ మోటార్ సైకిల్‌పై 10 లీటర్ల సారాను ఒమ్మంగి తరలించి రామాలయం వద్ద కొప్పన అప్పారావుకు అందజేస్తుండగా తమ సిబ్బంది వలపన్ని పట్టుకున్నార న్నారు. ముగ్గురు వ్యక్తులను మోటార్ సైకిల్‌తో సహా సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రతిపాడు మండలం ఒమ్మంగిలో సోమవారం హైపర్ విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధమెందని బాధితుడు కరణం ఆదినారాయణ తెలిపాడు. తమ పశువుల గ్రాసం కోసం ఒమ్మంగి గ్రామంలో రూ.10 వేలకు ఎండు గడ్డి కొనుగోలు చేసి ఇమిడిశెట్టి బాబాయ్‌కి చెందిన ట్రాక్టర్‌పై తమ గ్రామం సామర్లకోట మండలం వెంకట కృష్ణ రాయ పురం తరలిస్తుండగా గ్రామంలో 11 కెవి విద్యుత్ వైర్లు క్రింద నుండి ఉండడంతో తగిలి గడ్డితో పాటు ట్రాక్టర్ తొట్టి పూర్తిగా దగ్ధమైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల సమాచారంతో ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కోటనందూరు

జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు అన్నారు. మంగళవారం తుని పట్టణంలో వి.ధర్మరాజు అధ్యక్షతన ఏపీడబ్ల్యూజేఎఫ్ తుని నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు వాతాడ నవీన్ మాట్లాడుతూ విలేకరులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, బీమా సౌకర్యాన్ని పునరుద్ధించాలని, కరోనాతో మతి చెందిన విలేకరులకు పరిహారాన్ని అందజేయాలని ఇళ్ల స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని, 60 సంవత్సరాల నిండిన ప్రతి జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు, అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన ఏపీ డబ్ల్యు జే ఎఫ్ నూతన కార్యవర్గంతో నవీన్ ప్రమాణ స్వీకారం చేయించారు. లీగల్ సహాయకులుగా బోడపాటి సతీష్, గౌరవ అధ్యక్షులుగా పి. వంశీ, అధ్యక్షులుగా బోడపాటి ప్రవీణ్ చక్రవర్తి, ఉపాధ్యక్షులుగా అల్లవరపు అచ్చారావు, అన్నం శివరామకష్ణ, కోశాధికారిగా గరిసింగు సత్య వెంకట వరప్రసాద్, జాయింట్ కార్యదర్శిగా పడాల ప్రసాద్, ట్రెజరర్‌గా కె. లోవరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సిహెచ్ రామకృష్ణ తో పాటుగా పది మంది కమిటీ సభ్యులను ప్రమాణ స్వీకారం చేయించారు, కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం.లక్ష్మణ్, బోట్ల లోవరాజు, త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

18 వరకూ ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలో అన్ని గ్రామాలలో ఈ నెల 18 వరకూ ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్రీలలిత తెలిపారు. ఈ మేరకు మంగళవారం పనసపాడు, పీ వేమవరం, గ్రామాల్లో నిర్వహించామని, 15న ఉండూరు, నవర, జి.మేడపాడులలో, 16న మామిళ్ళదొడ్డి, అచ్చంపేట, పెదబ్రహ్మదేవం లోనూ, 17న ఆర్. చంద్రంపాలెం, గొంచాల, పెదబ్రహ్మదేవం లలోనూ, 18న పవర, వీకే రాయపురం వేట్లపాలెం లోనూ ఆధార్ అప్డేషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్రీలలిత చెప్పారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - కాజులూరు

బాలిక వివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు అంగన్‌వాడీ గొల్లపాలెం సెక్టర్ సూపర్వైజర్ కెవి. రమణి కుమారి తెలిపారు. మంగళవారం అంగన్‌వాడీ గొల్లపాలెం సెక్టార్ సూపర్వైజర్‌గా బాధ్యతలు స్వీకరించిన రమణి కుమారి మాట్లాడుతూ గ్రామాలలో కొంతమంది అవగాహన లేకపో వడంతో బాలికలకు వివాహం చేస్తున్నారని వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందితో కలిసి బాలికల తల్లిదండ్రు లకు అవగాహన కల్పించాలన్నారు.

డ్రోన్ ల ద్వారా పురుగు మందుల పిచికారీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

డ్రోన్ల ద్వారా పంట పొలాలలో పురుగు మందులు పిచికారి చేయడం ద్వారా రైతన్నలకు సమయం, సొమ్ము అవుతుందని ప్రత్తిపాడు మండల వ్యవసాయ అధికారి వై గంగాధర్ అన్నారు. డ్రోన్ ద్వారా 10 లీటర్ల పురుగు మందును పిచికారి చేసే విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. గ్రామంలోని అయిదుగురు రైతులు గ్రూప్‌గా ఏర్పడి 40 శాతం రాయితీపై డ్రోన్లను పొందవచ్చని, ఆసక్తి గల రైతులు వ్యవసాయ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

18 నుంచి జిల్లాలకు పది ప్రశ్నపత్రాలు

- ఏడు జిల్లాల్లో 1,59,679 విద్యార్థుల పరీక్షకు హాజరు
- 911 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు
- ఆర్‌జెడి నాగమణి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జెడి నాగమణి

ఉభయ గోదావరి జిల్లాలో ఉన్న ఏడు జిల్లాలకు ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు పదవ తరగతి పరీక్షలు సంబంధించిన ప్రశ్న పత్రాలు సంబంధిత కార్యాలయాలకు రానున్నాయని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖ అధికారి నాగమణి పేర్కొన్నారు. మంగళవారం పదవ తరగతికి సంబంధిం చిన వివరాలను ఆమె వెల్లడించారు. ఉభయగోదావరి జిల్లాలో ఏడు జిల్లాల్లోనూ 1,59,679 మంది విద్యార్థులు 911 పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే సిడి పిఎస్ ఇన్చార్జిలను నియమించారని, ఈ నెల 16న సీఎస్‌డీ, ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవోలతో సమీక్ష సమావేశం ఏర్పాటుచేశామన్నారు. పోలీస్ స్టేషన్‌కు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న పరీక్షా కేంద్రాలలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు చేసి, ప్రశాంత వాతావరణంలో 10వ తరగతి పరీక్షలు రాశాల అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.

రూ.55 లక్షలతో ప్రణాళిక సిద్ధం

- తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు
- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ శ్రీనివాస్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



ఎస్ఇ శ్రీనివాస్

వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా రూ.55 లక్షలతో వేసవి ప్రణాళికలు సిద్ధం చేశామని ఎస్‌ఈ ఎం.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తే రెండు మండలాల్లో ఎండీఒ, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, ఎలక్ట్రికల్ ఏఈ, ఈఒలతో మండలాల్లో ఏర్పాటు చేసిన కమిటీలు చర్చించి సమస్యను పరిష్కరిస్తాయన్నారు. మార్చి 15 నాటికి 15 చేతి పంపులకు మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 15 నాటికి సమగ్ర రక్షిత నీటి పథకంలో 15 ట్యాంకులను, సింగిల్ విలేజ్లో 7 ట్యాంకులను శుభ్రం చేయనున్నట్లు చెప్పారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉండే 15 ఆవాస గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. వీటికి గాను రూ.39.72 లక్షల నిధులతో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ నిధులను ఆయా గ్రామ పంచాయతీల 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి లేక పంచాయతీ సాధారణ నిధుల నుంచి సేకరిస్తామన్నారు. మెట్ట ప్రాంతాలైన ప్రత్తిపాడు, జగ్గంపేట, తుని నియోజక వర్గాల ప్రాంతాల్లో రూ 6.84 లక్షలతో ఇప్పటికే గుర్తించిన 72 చేతి పంపులను శుభ్రం చేయించను న్నట్లు చెప్పారు. తూరంగి-1, పెదపూడి-1, మండలాల్లో పంపింగ్ ద్వారా చెరువుల నింపడానికి రూ.8.5 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలో మొత్తం రూ.55.06 లక్షలతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. జిల్లాలో ప్రస్తుతం తాగునీటి సమస్య లేదని, మే నెలలో ఎండ తీవ్రతను బట్టి కొన్ని గ్రామాల్లో సమస్య ఎదురవ్వ వచ్చన్నారు. దానికి త గిన ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అవసరాన్ని బట్టి ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయిస్తామన్నారు.

కొనుగోలు చేయండి.... యజమానులు కండి...

- కోరంగిలో మహిళా మార్ట్ : డిఆర్‌డిఎ పీడీ శ్రీ రమణి

ప్రజాశక్తి - తాళ్లరేవు



మహిళా సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న పీడీ శ్రీ రమణి

మహిళలంతా మీరు ఏర్పాటు చేసుకున్న మహిళా మార్ట్‌లో కొనుగోలు చేయడం ద్వారా యజమానులు కావాలని డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీ రమణి అన్నారు. తాళ్ళరేవు మండలం కోరంగిలోని జి.ఎం.సి. బాలయోగి కళ్యాణ మండపంలో త్వరలో ఏర్పాటు చేయనున్న చేయూత మహిళా మార్టు పై మహిళా సంఘాలకు తాళ్ళరేవు ఏపీఎం కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వైయస్సార్ క్రాంతి పథంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు కిరాణా షాపులు, పశువుల కొనుగోలు వంటి వ్యాపారాలకు ధీటుగా మహిళలు మరింత అభివృద్ధి చెందేలా ప్రభుత్వం చేయూత మహిళా మార్టులను ఏర్పాటు చేస్తోందన్నారు. మహిళా సంఘాల ప్రతినిధులను యజమానులుగా చేయడానికి ఈ మహిళా మార్ట్ ప్రాజెక్టు ప్రారంభిస్తోందని తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి మహిళ నుంచి రూ. 200లు వాటాదనంగా స్వీకరించామని తాళ్లరేవు మండలంలో 22 వేల మంది మహిళల నుంచి రూ.44 లక్షలు మూలధనంతో ఈ మహిళా మార్టును త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వంతో ఒప్పందం కుదిరిన ప్రోక్టర్ అండ్ గాంబుల్ (పి.అండ్. జి.), హెచ్.యు.ఎల్. వంటి సంస్థలతో పాటు రిలయన్స్ సంస్థ ద్వారా ప్రత్యేక ధరలకు కిరాణా, పప్పు దినుసులు, ఇతర వస్తువులు దిగుమతి చేసి మహిళా మార్ట్‌లో సరసమైన ధరలకు విక్రయించనున్నట్లు ఆమె తెలిపారు. మహిళా మార్ట్‌లో కొనుగోలు చేసిన మహిళా సంఘాల మహిళలకు ప్రత్యేక రిబేటు ఉంటుందన్నారు. ఈ మార్ట్ లో కొనుగోలు చేయడం ద్వారా వచ్చిన లాభాలు మహిళా సంఘాలకే నేరుగా నేరుగా వస్తాయని దాని ద్వారా మహిళలే యజమానులుగా మారే అవకాశం ఉందని తెలిపారు. మండలంలోని 17 పంచాయతీల నుంచి 17 మంది మహిళలు ఈ మార్టు నిర్వహణ సభ్యులుగా ఉంటారన్నారు. వీరిలోంచి ఒక చీఫ్ ప్రమోటర్ ఎన్నిక చేసి ఆమె ద్వారా మార్ట్‌ను నిర్వహణ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను ఆమె తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు మేనేజర్ ఐ.బి. టి బాబురావు, వైయస్సార్ చేయూత జిల్లా ప్రాజెక్టు అధికారి విబిఆర్. రాయ్, తాళ్ళరేవు ఏపీవో సన్యాసిరావు, పలు మహిళా సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఇంకా ఇళ్ల నిర్మాణం చేపట్టని సుమారు 25 మంది లబ్దిదారులకు సత్వరమే పనులు చేపట్టాలని ఎంపిడిఒ డి శ్రీలలిత అవగాహన కల్పించారు. మండలంలోని పవర జగనన్న లే అవుట్‌కు చెందిన ఇళ్ల నిర్మాణ లబ్దిదారులతో ఎంపిడిఒ డి శ్రీలలిత సమావేశం నిర్వహించారు. ఇప్పటికే మార్కింగ్ ఇచ్చి నిర్మాణం జరుగుతున్న ఇళ్ల నిర్మాణం తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. పెదబ్రహ్మదేవంలో నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు శిబిరంలో సుమారు 180 మంది విద్యార్ధులకు ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించినట్లు ఎంపిడిఒ డి శ్రీలలిత చెప్పారు.


వివాహాల నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - కాకినాడరూరల్

మహిళా సంక్షేమం కోసం ప్రతి వివాహాన్ని తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయిం చాలని న్యాయవాది పెండెం శ్రీదేవి సూచించారు. సర్పవరం జంక్షన్ లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వివాహం అనంతరం కొందరు భార్య, పిల్లలను వదిలి పోతూండటం, కొందరు వివాహం చేసుకుని కూడా చేసుకోలేదంటూ మోసం చేస్తూన్న నేపథ్యంలో వివాహం జరిగిన నెల రోజులలోపు వీటిని రిజిస్ట్రేషన్ చేయించాలని అన్నారు. అధికారి సీలుతో వివాహ నమోదుపత్రాన్ని అందజేస్తారని శ్రీదేవి తెలిపారు. అడబాల రత్న ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి అడబాల కృషి అభినందనీయం

ప్రజాశక్తి - కాకినాడరూరల్



అడబాలను సత్కరిస్తున్న హరిబాబు

సుమారు మూడు దశాబ్దాల నుంచి వృద్ధుల సంక్షేమం కోసం సామాజిక సేవా కార్యకర్త అడబాల రత్న ప్రసాద్ చేస్తున్న నిరంతర కృషి అభినందనీయమని జాతీయ వినియో గదారుల సంక్షేమ సంఘ ఉపాధ్యక్షులు చదలవాడ హరి బాబు అన్నారు. రమణ య్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాలకు సీనియర్ సిటిజన్ గుర్తింపు కార్డును హరిబాబు అందజేసి అనంతరం సత్కరిం చారు. ఈ సందర్భంగా బుద్దరాజు మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా తన సొంత నిధులతో వృద్ధులకు ప్రతి ఏటా వేసవి కాలంలో పాదరక్షలు, శీతాకాలంలో దుప్పట్లు అడబాల పంపిణీ చేస్తూ, నేటి వరకు ప్రతి ఆదివారం వృద్ధులకు వైద్యులతో పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నారని అన్నారు మతాలకతీతంగా వారి పండుగ దినాలలో నూతన వస్త్రాలను అడబాల పంపిణీ చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాది కే. శ్రీనివాస్, హెచ్.ఎస్. రామకృష్ణ, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, ఎస్. శ్రీ నగేష్, తదితరులు పాల్గొన్నారు

నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో ఈనెల 15 వ తేదీ సాయంత్రం ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహిస్తు న్నట్టు పెద్దాపురం వినియోగదారుల సంఘం అధ్యక్షులు భళ్లమూడి సూర్యనారాయణ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో కమిషన్ న్యాయమూర్తులు చెరుకూరి రఘుపతి వసంత కుమార్, సభ్యులు చాగంటి నాగేశ్వరరావు, చెక్కా సుశీల పాల్గొంటారన్నారు.

త్రిమూర్తులు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆలమూరు



సాయం అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

పెదపళ్లలో నిరుపేద కుటుంబానికి చెందిన గొడితి త్రిమూర్తులు రోజువారీ వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తు న్నారు. వారు నివాసం ఉంటున్న ఇల్లు ఈమధ్యనే శిథిలమై కూలిపోయింది. దీంతో వారు నిలువనీడ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి చిన్న గూడు నిర్మించాలనే సంకల్పంతో తోటి గ్రామస్తులు రూ.1.30 లక్షలను సేకరించి గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు చేతుల మీదుగా త్రిమూర్తులు దంపతులకు అందజేశారు. సాయం అందేందుకు కృషి చేసిన వారిలో స్థానిక సొసైటీ అధ్యక్షులు నెక్కంటి వెంకట్రాయుడు, చింతలూరు వైసిపి నాయకులు నామాల శ్రీనివాస్, దాతలు అల్లూరి సత్యనారాయణ, యన్నన బుజ్జి, బొబ్బా ఏసుబాబు, బలుసు ముత్యాలు తదితరులు ఉన్నారు. ఆపేద దంపతులు తమవంత సహకారం అందించిన ప్రతి ఒక్కరికి కతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌డిజిపై సమీక్ష

ప్రజాశక్తి-పెరవలి

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం సస్టేనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్(ఎస్‌డిజి) సర్వేపై ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఇఒ హైమావతి, సిడిపిఒ శ్రీలక్ష్మి, ఎలక్ట్రికల్ ఎఇ డేవిడ్ నిచ్చల్, ఎఎస్ఒ వెంకటేష్, ఇఒపిఆర్‌డి నరసింహమూర్తి, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి -దేవరపల్లి

గౌరీపట్నంలో డంపింగ్ యార్డును జిల్లా పంచాయతీ అధికారి పి.జగదాంబ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 31 నాటికి ఇంటి పన్నులు, కుళాయి పన్నులు నూరు శాతం వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పల్ల వెంకన్న నర్సరీని సందర్శించిన నాయుడుపేట కమిషనర్

ప్రజాశక్తి-కడియం



మొక్కను అందజేస్తున్న దృశ్యం

తిరుపతి జిల్లా నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ యు.శ్రీనివాసరావు మంగళవారం కడియం పల్ల వెంకన్న నర్సరీని సందర్శించారు. నర్సరీ యాజమాన్యం పల్ల సత్యనారాయణ మూర్తి, వినయ్ ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నాయుడుపేట పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా మొక్కల ఎంపికకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు ఉన్నారు. ఆయనకు నర్సరీ యజమానులు మొక్కను అందించారు.

నగరంలో రోడ్ల విస్తరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగరంలో బుధవారం నుంచి రోడ్ల విస్తరణ పనులను ప్రారంభిస్తున్నామని, దీనికి ప్రజలు సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక షెల్టన్ జంక్షన్ ప్రాంతంలో రోడ్డు విస్తరణ ప్రాంతాలను నగపాలక సంస్థ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కమిషనర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ, నగరంలో రహదారుల విస్తరణ పనుల తొలిదశలో భాగంగా షెల్టన్ జంక్షన్ నుంచి తిలక్ రోడ్ వరకూ విస్తరణ పనులను చేపడుతున్నామన్నారు. నిత్యం రద్దీగా ఉండే మోరంపూడి జంక్షన్ నుంచి షెల్టన్ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. హైవే నుంచి అధిక సంఖ్యలో వాహనాలు నగరంలోకి ప్రవేశించడం, మోరంపూడి నుంచి షెల్టర్ వరకు ఉన్న రోడ్డు రద్దీగా ఉండటం వల్ల విస్తరణ పనులకు తొలి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. తొలిదశలో 80 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేపట్టనున్నట్టు దినేష్ కుమార్ తెలిపారు. నగరంలో రద్దీగా ఉండే మార్గాల్లో రెండు నెలలుగా సర్వే చేశారన్నారు. దాదాపు 62 నిర్మాణాలు ఈ రోడ్డు విస్తరణలో పాక్షికంగా ప్రభావితం అవుతాయని గుర్తించినట్లు పేర్కొన్నారు.

యానాం వార్తలు

త్వరలో ఆయుష్మాన్ భారత్ బకాయిల చెల్లింపు

నిధులు కేటాయింపుపై సీఎంకు ఎంఎల్ఎ అశోక్ కృతజ్ఞతలు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గానికి, ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నందుకు పుదుచ్చేరి సిఎం రంగసామికి ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్లో జిజిహెచ్‌లో అధునాతన లేబొరొటరీతో పాటు వివిధ విభాగాలను ఏర్పాటుచేస్తున్నారని ప్రకటించారని దీనికి యానాం ప్రజల తరపున ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. జిజిహెచ్ కు ఇప్పుడు ఇస్తున్నవే కాకుండా ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయిం చాలని కోరారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ అశోక్

జిజిహెచ్‌లో ప్రత్యేక వైద్యులను నియమించు కునే నిర్ణయాలు ఏమైనా ఉన్నాయాఅని ఎంఎల్ఎ అశోక్ ప్రశ్నిం చగా దానికి సీఎం రంగసామి జవాబు ఇస్తూ ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ వైద్యుల పోస్టులను అవుట్ సోర్సింగ్ ద్వారా భర్తీ చేయనున్నట్లు, సాంకేతిక సిబ్బందిని ఈ ఏడాదికి రిక్రూట్మెంట్ ద్వారా పర్మినెంట్‌గా తీసుకోనున్నామని సమాధానమిచ్చారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం ద్వారా వివిధ కార్పొరేట్ అసుపత్రుల్లో రోగులకు జరిగిన చికిత్సలకు సంబంధించి పెండింగ్ బిల్లులు పేరుకుపోయి ఉన్నాయని వాటికి బిల్లులు మంజూరు చేస్తారా అనిఅశోక్ ప్రశ్నించగా వాటిని త్వరతగతిన చెల్లించనున్నట్లు సమాధానమిచ్చారు.

కో-ఆపరేటివ్ సిబ్బందికి జీతాలు చెల్లించాలని వినతి

యానాం కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ లో పనిచేస్తున్న సిబ్బంది జీతాలు చెల్లించాలని మంగళవారం ఆర్ ఏ ఓ మునిస్వామిని కలిసి కో ఆపరేటివ్ స్టోర్స్ యూనియన్ సభ్యులు వినతి పత్రాన్ని అందించారు. తమకు 30 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, తామంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని కో-ఆపరేటివ్ స్టోర్స్ లాభాల్లో ఉన్న తమ జీతాలు చెల్లించడం లేదని సిబ్బంది తెలిపారు. గతంలో కోఆపరేటివ్ స్టోర్స్‌లో జరిగిన అవకవతలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎఒ మునిస్వామికి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ పువ్వల శ్రీనివాస్,రమణ,దూళ్ళ రామకష్ణ,రెడ్డి సుబ్రమణ్యం, జాఫర్,కూనపురెడ్డి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉచిత వైద్య శిబిరం

యానాం మత్స్యకారులకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఆయుర్వేదం, హెూమియోపతి డాక్టర్లతో ఒక్కరోజు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మత్స్యశాఖ అధికారి డి గొంతియ్య మంగళవారం తెలిపారు. మేరకు స్థానిక అయ్యన్న నగర్ గ్రామంలో కమ్యూనిటీ హాల్‌లోచ నిర్వహించనున్న వైద్యశిబిరంలో విష జ్వరాలు, కీళ్ల నొప్పులతో బాధపడే వారికి ఉచితంగా వైద్యం చేసి మందులు అందజేస్తున్నట్టు తెలిపారు. మత్స్యకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గొంతియ్య కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామాజిక పరిశుభ్రత పాటించి నప్పుడే సామాజిక ఆరోగ్యం పరిరక్షించ వచ్చని ఏపీ మాస్ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ కె.సత్యవతి అన్నారు. మంగళ వారం స్థానిక మెప్మా కార్యాలయంలో మెప్మా సీఎంఎం వెంకటలక్ష్మి అధ్యక్షతన ఆర్‌పిలకు తాగునీరు, వ్యక్తిగత పరిశుభ్రత, సామాజిక పారిశుధ్యంపై నిర్వహించిన శిక్షణా తరగ తులలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగిం చారు. ప్రతి ఇంటి నుండి 3 బుట్టల విధానం ద్వారా చెత్త సేకరణ నిర్వహిం చేలా, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని తాగేలా అవగాహన పెంచాలన్నారు. అనంతరం అందరితో వీటిని పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బి చంద్రకళ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సల్మా, శ్రీదేవి, విజయ కుమారి పాల్గొన్నారు.